క్లుప్తంగా

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు



నందిగామ: శ్రావణమాసం మంగళవారం షష్టి తిథి కలిసి రావడంతో పట్టణంలోని పలు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయాలలో ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణ శివారు గాంధీనగర్‌లో గల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో పలు రకాల విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఉపాలయంలో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆయా ఆలయాలలో జరిగిన పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



నవాబుపేట(పెనుగంచిప్రోలు): డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో చెల్లించాలని స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ గింజుపల్లి రవికుమార్ అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో 10 డ్వాక్రా గ్రూపులకు మంగళవారం రూ.1.26 కోట్ల రుణాల చెక్కులతో పాటు రైతు నేస్తం, కర్షకమిత్ర పథకాల కింద రైతులకు రూ.47 లక్షల రుణాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు రుణ పరపతి పెరిగినందున ప్రతి నెలా 5వ తేదీ లోపు వాయిదాలు చెల్లించి పావలా వడ్డీకి అర్హులు కావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు గింజుపల్లి మధు, సంఘ కార్యదర్శి బత్తుల సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

యువత వ్యవసాయ రంగంపై దృష్టి సారించాలి



చందర్లపాడు(నందిగామ టౌన్): రైతులంతా కలిసి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ప్రారంభించటం శుభపరిణామమని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. చందర్లపాడు మండలంలోని పున్నవల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత వ్యవసాయ రంగం వైపు దృష్టి సారించాలన్నారు. రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో గ్రామ, రైతు సంఘ నాయకులు చింతోటి ప్రసాద్, వాసిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి నర్సరీలలో నిబంధనలు పాటించాలి

వీరులపాడు: మిర్చి నర్సరీల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఉద్యాన శాఖాధికారి నీలిమ, ఏవో జోగేంద్రప్రసాద్ అన్నారు. వీరులపాడు వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం మిర్చి నర్సరీ యజమానులకు అవగాహన సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నర్సరీలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. సమావేశంలో పలువురు అధికారులు, నర్సరీల యజమానులు పాల్గొన్నారు.

మండల సచివాలయాల కన్వీనర్ షాబుద్దీన్‌కు అభినందన

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట మండల సచివాలయాల కన్వీనర్‌గా నియమితులైన ముక్త్యాల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ షాబుద్దీన్‌ను మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉదయభాను అభినందించారు. వత్సవాయి మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గాదెల రామారావు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా ఆయనను కూడా అభినందించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

నందిగామ: పేకాట శిబిరంపై నందిగామ పోలీసులు మంగళవారం దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. సీఐ హనీష్ తెలిపిన సమాచారం ప్రకారం మండలంలోని మాగల్లు సమీపంలో పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి నిర్వహించినట్లు తెలిపారు. ఆ సమయంలో పేకాడుతున్న 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద నుంచి రూ.7,780 నగదు, ఆరు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

జగనన్న పాల వెల్లువతో ఆర్థిక పురోగతి

జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్



కంచికచర్లలో చేయూత మహిళా మార్ట్‌ను పరిశీలిస్తున్న జేసీ సంపత్‌కుమార్

గనిఆత్కూరు(కంచికచర్ల): జగనన్న పాల వెల్లువతో మహిళలు ఆర్థికంగా పురోభివృద్ధి సాధిస్తున్నారని జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. కంచికచర్ల మండలం గనిఆత్కూరు గ్రామంలో మంగళవారం లబ్ధిదారులకు పాడిపశువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గ్రామాల్లో జగనన్న పాల వెల్లువ కేంద్రాలను ఏర్పాటుచేసి పాలు సేకరించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఎక్కువ మోతాదు పాలు ఇచ్చే ముర్రా జాతి గేదెలతో పాటు ఇతర మేలు జాతి గేదెలను లబ్ధిదారులే కొనుగోలు చేయాలన్నారు. ఒక్కో గేదె రూ.లక్ష వరకు ఉంటుందని, రూపాయి వడ్డీతో బ్యాంకులకు చెల్లించాలన్నారు. పాడి రైతులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తుందన్నారు. జగనన్న పాల వెల్లువకు పాలు పోసే మహిళా రైతుల పశుగణాభివృద్ధి కోసం రైతు భరోసా కేంద్రాల ద్వారా పశుగ్రాస విత్తనాలు, దాణామృతం అందిస్తామన్నారు. పశుగ్రాసాన్ని ముక్కలు చేసే చాప్‌కట్టర్‌ను కూడా ప్రభుత్వం 40 శాతం రాయితీతో పంపిణీ చేస్తుందన్నారు. అనంతరం 24 మంది లబ్ధిదారులకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.24లక్షల విలువ గల పాడి గేదెలను పంపిణీ చేశారు.

వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ సందర్శన

వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ మహిళల ఆర్థికాభ్యున్నతికి తోడ్పాటు అందిస్తుందని జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ అన్నారు. పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న వారి భాగస్వామ్యంతో ఇటువంటి మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. దీని ద్వారా మహిళలే సొంతంగా వ్యాపారం ప్రారంభించి ప్రజల ఆదరణ పొందుతున్నారని తెలిపారు. ప్రసిద్ధ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని నాణ్యమైన నిత్యావసర సరుకులను కొనుగోలు చేసి మహిళా మార్ట్ ద్వారా ప్రజలకు అందిస్తున్నారన్నారు. అనంతరం కంచికచర్ల వెలుగు కార్యాలయంలో ఎంబ్రాయిడరీ కుట్టు మిషన్‌ను లబ్ధిదారునికి అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ పబ్బూరి శంకరబాబు, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, ఏపీఓ కోట భాస్కరరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కంచర్ల పద్మావతి, ఎంపీటీసీ సభ్యుడు వెంపరాల వెంకటేశ్వరరావు, మహిళా చేయూత అధ్యక్షురాలు రోజారమణి, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.



గనిఆత్కూరులో లబ్ధిదారులకు పాడిపశువులను పంపిణీ చేస్తున్న జేసీ సంపత్‌కుమార్, డీఆర్‌డీఏ శ్రీనివాసరావు

న్యాయ సేవా శిబిరం ఏర్పాట్ల పరిశీలన



న్యాయ సేవా శిబిరం ఏర్పాట్లకు సంబంధించి చర్చిస్తున్న న్యాయమూర్తులు, రెవెన్యూ అధికారులు

నందిగామ: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా పరిపాలన యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో నందిగామ పట్టణంలో నిర్వహించనున్న నూతన తరహా న్యాయ సేవా శిబిర ఏర్పాట్లకు సంబంధించి మంగళవారం సాయంత్రం పలువురు న్యాయమూర్తులతో కలసి రెవెన్యూ అధికారులు పరిశీలించారు. పట్టణంలోని నెహ్రూనగర్‌లో గల కమ్మ కల్యాణ మండపంలో ఈనెల 26 వ తేదీ ఉదయం 8:30 గంటలకు నూతన తరహా న్యాయ సేవా శిబిరం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి చేయవలసిన ఏర్పాట్లు తదితర అంశాలపై న్యాయమూర్తులు ఆర్డీవో రవీంద్రరావుతో చర్చించారు. ఈ సందర్భంగా పట్టణంలోని జిల్లా 16వ అదనపు కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, పరిపాలన యంత్రాంగం, పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నూతన తరహా న్యాయ సేవల శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పలు రకాల స్కీములకు సంబంధించి ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని న్యాయమూర్తి శ్రీనివాసరావు సూచించారు. కార్యక్రమంలో పలు కోర్టుల న్యాయమూర్తులు వి.లక్ష్మీ రాజ్యం, షేక్ రియాజ్, పలు మండలాల తహసీల్దార్‌లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

జగ్గయ్యపేటఅర్బన్: ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఇనుపనుర్తి శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా పలువురు నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బియ్యం, కందిపప్పు, నూనె తదితర నిత్యావసర సరుకులు అందజేశారు. సంఘం సభ్యులు శంకరరెడ్డి, పి.కుమారి, బాజీ, కల్పన, శోభారాణి, న్యాయవాది, క్రైస్ట్ చర్చి, ఏబీటీసీసీ సభ్యులు పాల్గొన్నారు.

సంఘం నందిగామ డివిజన్ చైర్‌పర్సన్‌గా కుమారి

ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం నందిగామ డివిజన్ ఎస్సీ, ఎస్టీ విభాగం చైర్‌పర్సన్‌గా పైడిముక్కల కుమారి నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ చైర్మన్ కాసల కోనయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర చైర్మన్ పత్తిపాటి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో కుమారిని నియమించినట్లు ఆమె తెలిపారు.

సమన్వయంతో పనిచేస్తే గ్రామాల అభివృద్ధి

మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి



మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోటేరు లక్ష్మి

వీరులపాడు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేశారన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు నిత్యం అండగా ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించటమే కాకుండా, గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. అనంతరం దాచవరం సర్పంచ్‌గా ఎన్నికైన గద్దె వెంకటేశ్వర్లు, ఉత్తమ తహసీల్దార్‌గా అవార్డు అందుకున్న ఆశయ్య నాయక్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వేమూరి ఆదాం, షేక్ నాగుల్‌మీరా, ఎంపీటీసీ సభ్యులు తోట నారాయణరావు, ఇప్పల సత్యనారాయణ రెడ్డి, శీలం రమణారెడ్డి, అయిలూరి వెంకట్రావమ్మ, బండి సీతామహాలక్ష్మి, తమ్మిశెట్టి వరలక్ష్మి, పల్లె పోగు మార్తమ్మ, సర్పంచ్‌లు మారపాక మహాలక్ష్మి, నిప్పులపల్లి శాంతమ్మ, చలమల దుర్గారావు, నంద్రు సౌజన్య, ఎంపీడీవో అరుంధతీ దేవి, ఏవో జోగేంద్రప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి వాణి, ఏపీవో జనార్ధన్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రీ సర్వే మరింత వేగవంతం చేయాలి

జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్



రీ సర్వేకు సంబంధించి సిబ్బందితో సమీక్షిస్తున్న జేసీ సంపత్‌కుమార్

నందిగామ: రీ సర్వే మరింత వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం డివిజన్ పరిధిలో జరుగుతున్న రీ సర్వేకు సంబంధించి ఆర్డీఓ రవీంద్రరావుతో కలిసి సిబ్బందితో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ప్రతి మండల పరిధిలో జరుగుతున్న రీ సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కొందరి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ సకాలంలో రీసర్వే పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి గ్రామంలోనూ జరుగుతున్న రీసర్వేకు సంబంధించి ఎప్పటికప్పుడు సిబ్బందితో మానిటరింగ్ చేస్తున్నట్లు తెలిపారు. రీసర్వే వలన దీర్ఘకాలంగా పరిష్కారం కాని ఎన్నో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని సర్వేయర్లు, పలు మండలాల తహసీల్దార్లు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

మండలంలో ఓటర్ల పరిశీలన 85.41 శాతం పూర్తి

పెనుగంచిప్రోలు: మండలంలో ఓటర్ల పరిశీలన 85.41 శాతం పూర్తయిందని తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి అన్నారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ మండలంలో మొత్తం 44 పోలింగ్ కేంద్రాల పరిధిలో 19,253 గృహాలు ఉన్నాయన్నారు. వీటిలో 39,919 మంది ఓటర్లకు గాను ఇప్పటివరకు 34,094 ఓటర్ల పరిశీలన పూర్తయిందన్నారు. ఈ పరిశీలనలో 44 తప్పులు గుర్తించటంతో పాటు 100 మంది ఓటర్లు మృతి చెందినట్లు, 76 కొత్త ఓట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. పరిశీలన తేదీ పెరిగితే కొత్త ఓట్లు కూడా పెరిగే అవకాశం ఉంటుందన్నారు. అన్నిటినీ నిశితంగా పరిశీలిస్తామన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

నందిగామ: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ సూచించారు. పట్టణంలోని కాకతీయ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో మంగళవారం సాయంత్రం ఆయన విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రతి విద్యార్థితో కొంతసేపు ముచ్చటించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తాను ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేంతవరకు కష్టపడి చదువుకోవాలన్నారు. అనంతరం ఆయన్ను పాఠశాల నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కాపా రవీంద్రనాథ్, డైరెక్టర్ కార్తికేయ, పలువురు అతిథులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటకు ఆప్కో విక్రయశాల మంజూరు

వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు

జగ్గయ్యపేటఅర్బన్:జగ్గయ్యపేట పట్టణానికి ఆప్కో విక్రయశాల మంజూరైనట్లు వైఎస్సార్ సీపీ చేనేత విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. జగ్గయ్యపేట నియోజకవర్గ స్థాయిలో చేనేత ఉత్పత్తుల విక్రయశాల మంజూరుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సిఫార్సు చేశారని, ఆ మేరకు ఆప్కో విక్రయశాల కేంద్రాన్ని మంజూరు చేశారని తెలిపారు. ఆప్కో విక్రయ శాల ఏర్పాటు నిమిత్తం ప్రభుత్వ స్థలాలు, మున్సిపల్ స్థలాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అతి త్వరలో జగ్గయ్యపేట పట్టణ వాసులకు చేనేత ఉత్పత్తులు, అన్ని రకాల డ్రెస్ మెటీరియల్ సరసమైన ధరలకు ఆప్కో సంస్థ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

ఓటర్ల ఇంటింటి సర్వే వేగవంతం చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ షంషద్దీన్ బేగం

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఇంటింటి సర్వే వేగవంతం చేయాలని జగ్గయ్యపేట నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి షంషద్దీన్ బేగం తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గత ఏడాది జనవరి 6వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు సంబంధించి ఓటరు జాబితాలో తొలగించిన ఓట్ల విధానంపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నియోజకవర్గ ఈఆర్‌వో జి.మహేశ్వరరావు అధ్యక్షతన సమీక్ష సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణ పరిధిలోని పోలీంగ్ బూత్ 42, మండలంలోని చిల్లకల్లు గ్రామ పరిధిలోని పోలింగ్ బూత్ 77 లో తొలగించిన ఓటర్లను నిజనిర్ధారణ చేయాల్సిందిగా రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు. ఈ రెండు పోలింగ్ బూత్‌ల పరిధిలో చనిపోయిన ఓటర్ల ఇంటికి డీఎండబ్ల్యూవో స్వయంగా వెళ్లి పరిశీలించారు. ఈ పరిశీలనలో సక్రమ మార్గంలోనే తొలగించినట్లు వారి కుటుంబ సభ్యుల ద్వారా ఆమె తెలుసుకున్నారు. సమావేశంలో సమగ్ర సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్, జగ్గయ్యపేట ఏఈఆర్‌వో ఎం.సూర్యారావు, మండల ఏఈఆర్‌వోలు, బీఎల్‌ఏ, బీఎల్‌వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేషనల్ ఆక్వాటిక్ చాంపియన్ షిప్ విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న విజయవాడ మేయర్ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): నేషనల్ ఆక్వాటిక్ చాంపియన్ షిప్ విజేతలను నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం అభినందించారు. విజయవాడ నగరపాలక సంస్థ సర్ విజ్జి స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు ఒడిశా, భువనేశ్వర్‌లోని బిజు పట్నాయక్ స్విమ్మింగ్ పూల్‌లో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు జరిగిన 39వ సబ్ జూనియర్, 49వ జూనియర్ నేషనల్ ఆక్వాటిక్ చాంపియన్ షిప్– 2023లో గెలుపొందారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్, కమిషనర్లను ఎన్టీఆర్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ ఐ.రమేష్ ఆధ్వర్యంలో మెడల్స్ సాధించిన విద్యార్థులు మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. ఈవెంట్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరపున పాల్గొని మెడల్స్ సాధించటం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి నగరానికి మణిహారంగా నిలవాలని ఆకాంక్షించారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి



లబ్ధిదారులకు పొట్టేలు పిల్లలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ కోటేరు లక్ష్మి

వీరులపాడు: మహిళా సాధికారతతో పాటు మహిళల ఆర్థిక స్వావలంబనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ఎంపీపీ కోటేరు లక్ష్మి తెలిపారు. మండలంలోని జయంతి, దొడ్డదేవరపాడు, వీరులపాడు, అల్లూరు, గూడెంమాధవరం, పొన్నవరం, జుజ్జూరు, తాటిగుమ్మి, బోడవాడ గ్రామాల్లోని డ్వాక్రా సంఘాల సభ్యులకు మంగళవారం ఆమె పొట్టేలు పిల్లల యూనిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళా సంక్షేమం, రక్షణకు పెద్దపీట వేశారన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రభుత్వ పథకాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేస్తే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా సంఘాలకు పూర్వ వైభవం తీసుకువచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏపీఎం యెహోషువా, సర్పంచ్‌లు షోడగిరి రాజశ్రీ, బండెల రాణి, రమావత్ కోటి, పలకా మోహన్‌రెడ్డి, శీలం సంధ్య, మారపాక మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు తోట నారాయణరావు, ఇప్పల సత్యనారాయణ రెడ్డి, బండి సీతామహాలక్ష్మి, మోంద్రు బాయమ్మ, అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ పక్షాలతో ఆర్డీఓ సమావేశం

నందిగామ: నియోజకవర్గ పరిధిలో పూర్తికావస్తున్న ఇంటింటి ఓటరు సర్వేకు సంబంధించి మంగళవారం సాయంత్రం ఆర్డీవో ఎ.రవీంద్రరావు అన్ని రాజకీయ పక్షాల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నియోజకవర్గంలో బూత్ లెవెల్ అధికారులు నిర్వహిస్తున్న ఇంటింటి ఓటరు సర్వేను క్షుణ్ణంగా పరిశీలించి సవరణలు చేయాలని సూచించారు. నాణ్యమైన ఓటరు జాబితాను సిద్ధం చేసుకునేందుకు అన్ని రాజకీయ పక్షాల నాయకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నందిగామ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నందిగామ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాసరావు మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల పరిషత్ అధ్యక్షురాలు శ్రీమతి అరిగెల సుందరమ్మ అధ్యక్షతన ఉదయం 10:30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): స్థానిక పాలకేంద్రంలో మంగళవారం పాలు పోసే పాడి రైతులు 110 మందికి రూ.2.10 లక్షల బోనస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, పాలకేంద్రం చైర్మన్ కొత్తపల్లి రామనాథం, కేంద్రం కార్యదర్శి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులను ఆకర్షించేలా స్మృతివనం

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



స్మృతివనం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి పర్యవేక్షణలో ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా అంబేడ్కర్ స్మృతివనం పనులు చేపడుతున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. నగరంలోని స్వరాజ్ మైదానంలో నిర్మాణంలో ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహ స్మృతివనం నిర్మాణ పనులను మంగళవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. స్మృతివనం పనులను సీఎం వైఎస్ జగన్, ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తూ పలు సూచనలు చేస్తున్నారన్నారు. డిజిటల్ మ్యూజియం, మినీ థియేటర్ నిర్మాణపు పనులు దాదాపు పూర్తయ్యాయని, లైటింగ్, గ్రానైట్, పాత్ వే, వాటర్ ఫౌంటెన్, వెహికల్ పార్కింగ్, ఎలక్ట్రిసిటీ, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ సుందరీకరణ తదితర పనులను మరింత వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. నిర్మాణ పనులను రానున్న రెండు నెలల్లో పూర్తిచేసి ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు. పనులు పరిశీలన వారిలో ఏపీఐఐసీ చీఫ్ ఇంజినీర్ నరసింహారావు, జోనల్ మేనేజర్ సీతారాం, డెప్యూటీ జోనల్ మేనేజర్ రహీమ్, కేపీసీ ప్రాజెక్టు డైరెక్టర్ పి.వాసుదేవరావు, ప్రాజెక్ట్ మేనేజర్లు కె.కృష్ణమోహన్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి ఇన్‌చార్జ్ ఏసీగా జయప్రకాష్

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ఇన్‌చార్జ్ ఏసీగా వేదాద్రి ఈవో జయప్రకాష్ అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పనిచేసిన ఏసీ బదిలీపై పెదకాకాని శివాలయానికి వెళ్లారు. ఈ మేరకు దేవదాయ శాఖాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయి.

జగనన్న పాలవెల్లువపై అవగాహన

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జగనన్న పాలవెల్లువ కార్యక్రమంపై డ్వాక్రా మహిళలు, వైఎస్సార్ చేయూత లబ్ధిదారులు, పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి అనిల్ మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా మొదటగా మండలంలోని ముండ్లపాడు, శనగపాడు, కొణకంచి, నవాబుపేట, వెంకటాపురం, వెంగనాయకునిపాలెం గ్రామాల్లో అమూల్ ద్వారా పాల సేకరణ జరుగుతుందన్నారు. రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ సిద్ధారెడ్డి, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, సొసైటీ అధ్యక్షుడు గూడపాటి రవికుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, ఏపీఎం రాజారావు తదితరులు పాల్గొన్నారు.